# పరిష్కారం ★

ఘట్టి కృష్ణమూర్తి

"శాంతా! శాంతా!! "

"ఎక్కడికి పోయిందో. పిల్లాడు ఇలా పోరుపెట్టి ఏడుస్తున్నా తీసుకోకుండా. శాంతా!"

"వోయ్. వొస్తున్నా."

"ఎప్పుడొస్తున్నావ్ పిల్లడు అలా గుక్కపట్టి ఏడుస్తుంటే వదిలిపెట్టి వూరుకొని? గడపలు దిగి వచ్చేస్తున్నాడు ఇంకానయం వీధిలోకివస్తే ఏ గేదెలన్నా తొక్కేసును"

"ఆదంతా యేడుపనుకున్నారా యేమిటి? నాన్న బజార్నించి రావడంచూచి దొంగ వేషాలువెధవకి—ఇంకేం వచ్చారుగా! ఎత్తుకుని ఆడించండి!"

"ఇంతలోకే నేను ఏం తెచ్చానని వాడకిపెట్టి ఆడించటానికి? కాసినిపాలన్నా కలిపి పొయ్యి, వూరుకుంటాడేమో ..పొట్ట ఏడుస్తోంది వెధవకి మధ్యాహ్నంనించీ పాలు పొయ్యలేదూ?"

"...... "

"ఏమిటి అలాచూస్తూ నుంచుంటావేం? కాసిని పాలుకలిపి తీసుకురా అంతవరకూ నేను ఎత్తుకుంటాలే ఇదిగో ఈసంచీకూడా ఇంట్లో పడెయ్యి!"

"అబ్బా ఎంత చమత్కారం! మొన్నపొద్దు నవగా పాలడబ్బా తేవాలని చెబితే . ఎందుకు అట్లా నన్ను ఏడిపిస్తారు?"

"నిన్ను ఏడిపించడమా? అదేమిటి శాంతా?"

"కాదుమరీ, ఏమి ఎరుగనివారిలాగా ఇంట్లో పాలడబ్బా వుంటే మధ్యాహ్నంనించే పొయ్యకుండా పిల్లణ్ణి ఏడిపిస్తానా?"

"అవును- పాలడబ్బా తేవాలనుకున్నావ్ కాని ఒక్క పూటకు కూడా లేదని నాతో చెప్పలేదు కాదూ?"

"ఇంకా వెంటబడి వేపుకు తినలేదంటారు అంతేనా?" ఆయినా ఇంత మరిపిష్టి మనిషికి..."

"నిజంగా మర్చిపోయానంటావా?"

"నాచేత ఎన్నిసార్లు అనిపిస్తారు? గుర్తు తెచ్చుకోండి! మొన్నరాత్రి మీరే—బజారులో పాల డబ్బాలు దొరకడం లేదు. దొరికినా రూపాయి బేడ అమ్మేది రెండురూపాయలన్నర అయింది. ఇంక మనం కొనడం కష్టం అందుకని పిల్లాడికి మూడుపూటలా అన్నం పెట్టడమే అలవాటు చెయ్యమన్నారు."

"అయితే అన్నమే పెడుతున్నావన్నమాట?"

"నిన్నా ఇవ్వాళా అలా పెట్టడం మొదలెడితేనే మామూలుగా తినే మెతుక్కూడా మింగడం లేదు, మధ్యాహ్నం మీరు వెళ్ళినతరువాత కాస్త చారు పోసి పల్చగా కలిపి నోట్లో పెడి థళ్లున ఊసేశాడు. అప్పట్నించీ ఇదేవరస ఏడవడానికి."

"ఇవ్వాళ సాయంత్రం మాధవుడూ నేనూ బజారంతా గాలించినా ఒక్కటంటే వొక్కటి మంచి డబ్బా దొరకలేదు. ఏనాడో వచ్చిన నక్షత్రం మార్కు డబ్బా వొకడిదగ్గర వున్నది అదయినా యెర్రపడి గడ్డకట్టుకు పోయింది. పధ్నాలుగణాలు అమ్మేది రెండురూపాయల పావలాకి కొనుక్కువెళ్ళాడు అసలు లేనిదానికంటే నయంకదా అని"

"నయమే. అతనికేం నూటయాభై రూపాయల జీతం. అది పనికిరాదన్నా రేపు మరోటి కొనుక్కువెడతాడు. మరి...మంచిది దొరికినా మన కిక్కడ డబ్బా లేదు"

"బొత్తిగా లేదంటావా? అయితే వీడిప్పుడు ఏడుపు మానే విధానం?"

అబ్బ....ఎన్నిసార్లు నాచేత అనిపిస్తారు లేదని? వాడలా ఏడుస్తుంటే మీకేకావున్న కడుపు తరుక్కుపోయేది!"

ఎవరికైతేనేం మనమీదనే పంచప్రాణాలూ పెట్టుకు బ్రతుకుతున్న పసికూనల్ని మనతోటు మార్చి చంపడం—వాడికేంతెలుసునని? ఇటు చూడు! ఒక్కసారి నవ్వలెట్టు! గొంతు తడిస్తే యేమన్నా పూరుకుంటాడేమో .. రేపుకూడా ప్రయత్నించి చూస్తాను. మాధవుడు కూడా వూళ్ళో లేడు. మానకు దబ్బెవరిస్తారు?"

★

రాత్రి చెప్పారుగా, ఇవ్వాళకూడా ప్రయత్నించి చూస్తావని. మ రి బ జా రు లో పా ల డ బ్బా యేమైనా? .. ..."

మాధవరావు పూరినుంచి రాలేదుకావున్న. అయినా అప్పుడే వస్తాడూ, నిన్న సాయంత్రమేగా వెళ్ళింది?"

.......—

"ఇంకా ఇలాగే కూర్చున్నారేం అన్నానికి లేవండి. పిల్లాడు పడుకున్నాడు ఇప్పుడే- మళ్ళీ లేచాడంటే మన యిద్దర్నీ కూడా అన్నం తిన్నియ్యడు!" తరువాత రాసుకోవచ్చు లెండి!-"

"........."

అయినా ఇవ్వాళ వొడిమెతుకులే లేండి. చాలాపథ్యంగా వుంటుంది భోజనం చల్లలేదు, నెయ్యిలేదు కూరలులేవు —"

" ....... "

"పాపం అన్నంలోకి ఏమీ లేదనేటప్పటికి తలెత్తి చూశారు. అవును మరి-గొల్లది పెరుగు పొయ్యడం మానేసి మూడురోజులైంది. మొన్న వేసుకున్న అరవీశడు వెన్నకు డబ్బు ఇవ్వనిదే మళ్ళీ అర్ధశేరునవటాకన్నా పెయ్యనన్నది రత్తమ్మ. అదిగాక క్రిందటి నెల్లో పాలు పోయించుకున్న డబ్బు మరోరూపాయి పావలా అర్ధణా బాకీ వున్నదట దానికి. ఫస్టుతారీకుతో ఎక్కడివార్లక్కడ బిగించుకు కూర్చున్నారు. పరే కూరలవాడు ప్రొద్దున మీరింట్లో వుండగానే వచ్చి వెళ్లాడుకదా!

"సరే అయితే . విస్తట్లో అన్నం పెట్టలేదుగా. కొంచంసేపు ఆగు ఇది పోస్టులో పడేసి ఇపుడే వచ్చేస్తాను-లేకపోతే ఇంతలో నువ్వు తిను తరువాత నాకు పెడుదువుగాని!"

అంత తొందరేం నాలుగింటిలోపల పోస్టులో పడయ్యవచ్చు-అన్నానికి పదండి. పన్నెండు గంటలు దాటిందికూడా''

"నిన్ను ముందర తిననున్నానుగా''

"ఎంత తేలిగ్గా అంటావు తినెయ్యమని! విస్తట్లో అన్నమన్నా పెట్టుకుతిండం చేతగాదు మళ్ళీ"

"...వాకేటులో కార్డువుండాలి ఏమైందే?''

"ఏమౌతుంది?-ప్రతిదానికీ మతిమరుపేనా-అప్పుడే పైత్యాన పడుతున్నట్టున్నది ప్రాణం నిన్న మధ్యాహ్నమేగా కాకినాడకు ఉత్తరం రాశారు నరసింహానికి?"

"ఆ ..అయితే పద అన్నంపెట్టు!"

"ఏమిటావుత్తరం? అంత అర్జంటుగా వెయ్యాల్సినది?"

"ఏదోలే...పద....అన్నంపెట్టు''

"ఇంతసేపట్నుంచీ మీకు ఆలస్యం చెయ్యొచ్చుగాని ఒక్కమాట చెప్పేసరికే అంతా మిగిలిపోతుంది కావున్న"

"నేను చెప్పను - ఇదిగో ... కావాలంటే చూసుకో!"

"ఏం నాకు తెలియదనేగా మీకు...ఇలా ఇవ్వండి చూస్తాను"

"అయ్యో...నీకు తెలియక పోవడమేమిటి తర్ధోపారం పాపైనదానవు-'

......ఏమిటిదీ?''

"ఏం నీ కెలా కనబడుతోందే?"

''మరీ.... ..?''

తొందరపడకు. నాకు తెలుసు నేనూ ఆలో చించాను-చివరకు తోచింది అంత్య నిష్ఠూరం కంటే ఆదినిష్ఠూరమే మేలని " అందుకే ఈపని చేశాను'

''అమ్మయ్యో....''

"మరేం గాభరా పడకు పద. అన్నం పెట్టు.''

★

''నన్ను హాయిగా చచ్చిపొమ్మంటారా?''

"సిచ్చిదానా. నువ్వూ నేనూ చచ్చిపోయి నంత మాత్రాన తీరే సమస్య కాదు ఇది జాతినంతనీ పీడిస్తున్నది పిశాచంలాగ"

అందుకని నిండు జీవనాన్ని చేతులారా ''

"అది మన కంట బడలేదు కనుక శిశుహత్యా దోషం మనకు అంటదు. పెద్దపెద్ద విజ్ఞాన వేత్త లంతా నిర్ణయించిన విధానమే ఇది. ఇదిగో ఈ పత్రికనిండా చూడు. పెద్ద పెద్ద అక్షరాలతో .. ఎంతమంది సర్టిఫికెట్లు ఇచ్చారో...చేతులారా.. నేనే ."

"అవును మీరే-మున్మాటికీ మీరే.''

"కోపగించకు కాంతా-నభ్యతా ప్రపంచానికి దూరమై పోతున్నామని ఏనాటి సంస్కారమో నిన్ను యింకా పట్టి బాధిస్తున్నది ఈ దారిద్ర్య దేవత నన్ను ఏనాడో మ్రింగేసింది అదే నన్నీ అకార్య కరణాలకు ప్రోత్సహిస్తుంది నిజం చెప్పు .నీకు... ఇప్పుడు ."

'....... '

'చెప్పుకాంతా కన్నీరెందుకు? "

" అవును-మూడోనెల "

"ఈ పసిగుడ్డు పాలన్నా వదలలేదే ..మళ్లీ

"అవును. మీరేం జేసినా దానిలో నాకూకొంత పాలు లేకపోలేదు-అందుకేగా మాటిమాటికీ నన్ను "

"ఏన్నేం చెయ్యలేను కాంతా. ఈ బలహీనత అంతా... ...''

నాది-నేను హాయిగా చచ్చిపోనా?— అమ్మయ్యో .."

"కాంతా అలా పడిపోకు. పడిపోకు!!"

★

"విన్నటివించీ విచారిస్తున్నా నా కేమీ పాలు పోవడంలేదు నిజంగా తప్పంతా నాదేనంటావా కాంతా?"

"నన్నేంజెయ్యమంటారు? వేళకి ఇంత అన్నం వండి పెట్టి మీ ఇష్టం వచ్చినట్టు మెలగుతూవుండ డమేగా నేను చేస్తున్నదల్లా. అంతకంటే నాకే మన్నా తెలుసునంటారా?"

"నిజమే నీ కేమీ తెలియదు నేనే-నిన్ను అవసరంగా ఉసురు పెట్టాను ఈ పుట్టిన బిడ్డ కంటే ఇంక పుట్టబోయే వాడి భవిష్యత్తు తలుచు కుంటే-పేగులు కోసుకు పోతున్నాయ్ "

"అలా పిచ్చివారులాకూచుంటే మనకి ఎవరు చెబుతారు చెప్పండి నాలుగు మెతుకులు తిని ఆ రామమూర్తి గారు రమ్మన్న సంగతేమిటో కనుక్కురండి. మన ఆవేదనలు ప్రపంచం ఏనా టికీ గుర్తించదు మన స్వయంకృషిపైనే తిరిగి ఉద్యోగం సంపాయించాలి లేవండి పిల్లవాడికోస మైనా . . . "

"లేస్తాను మనకి 'బిడ్డ'అయి పుట్టిన ఈ దౌర్భాగ్యుడి బ్రతుకు యేమౌతుందా? అని"

"నాబిడ్డని బ్రతికించుకోవడానికి నేనుకూడా యేమైనా చెయ్యగలనేమో ఆలోచించాను ఈ రోజునే పార్వతమ్మ గారి దగ్గరకి వెళ్లి అడుగు దామనుకుంటున్నాను."

"ఏమని?"

"నేను చేయగలిగినపని యేమైనా చూపించ మని"